ప్రొద్దున్నే ఆమె పేపరు కాఫీ తీసుకుని వచ్చింది ఉన్న వాళ్ళలో ఆమె కాస్త మంచిదిలా కనబడింది అతడు కాఫీ తాగుతూ పేపర్ అందుకున్నాడు మొదటి పేజీలో ఒకమూల ప్రకటన చూసి అతడు నిటారుగా అయ్యాడు.

రామ్‌లాల్,

నువ్వు ఎక్కడున్నా వెంటనే ఆశ్రమానికి రావలెను. ఈరోజు మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ చూసెదము. నీ భార్యా పిల్లలు నీకై ఎదురు చూస్తున్నారు. నీకు రావడం వీల్లేకున్నా వారికి టిక్కెట్టు బుక్ చేసేదము.

ఇట్లు,

నీ మిత్రుడు.

అతడి చేతిలో కాఫీ కప్పు వణికింది.

ఈ వార్నింగ్ అతడికి తెలుసు. తమ వాళ్ళమీద అనుమానం వస్తే తను కూడ ఇలాగే ఇచ్చేవాడు. అతడి మొహం రోషంతో కందిపోయింది.

ఏమిటి ఏమైంది? అని అడిగింది మాల అతను జవాబు చెప్పలేదు. అతడికి మొదటిసారి తన వాళ్ళ మీద విపరీతమయిన కోపం వచ్చింది.

మధ్యాహ్నం ఒంటిగంట అవుతూండగా ఇద్దరు డాక్టర్లతో కలిసి వచ్చాడు విహారి బ్యాండేజి విప్పాడు.

తెల్లగా పాలిపోయి ఉన్నాయి పాదాలు. రామ్‌లాల్‌కి తన శరీరాన్ని చూసుకోవటానికే భయం వేసింది. డాక్టరు బయట మాట్లాడుకోవటం విన్పించింది. ఇన్‌ఫెక్షన్ బాగా స్పీడ్‌గా వ్యాపిస్తుంది. తొందరగా ఆపరేషన్ చేస్తే మంచిది.

ఆ ఆస్పత్రి వద్దు డాక్టర్ అక్కడంతా అతడిని చంపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి వేరే ఆస్పత్రి మాట్లాడాము. డాక్టర్ కృష్ణ మూర్తి అక్కడికే వస్తానన్నారు అంటున్నాడు విహారి.

పరిస్థితి తను అనుకున్నదానికంటే తీవ్రంగా వున్నట్టు గ్రహించాడు.

అరగంట తరువాత అతడిని వ్యాన్‌లో మరో ఆస్పత్రికి తీసుకువెళ్ళారు. ఈసారి ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చినట్టు గ్రహించాడు.

సమయం మూడయింది.

ఒక్కొక్క ఏర్పాటు పూర్తవుతూంటే రామ్‌లాల్ మనసు వాసిలేటింగ్‌గా తయారయింది. ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్ళబోతూంటే విహారి హడావుడిగా వచ్చాడు. అతడి మొహంలో టెన్షన్‌తో పాటు బాధ గోచరమవుతుంది. రామ్‌లాల్ మీద చెయ్యి వేసి అయామ్ సారీ అన్నాడు.

ఏమిటి? ఏమైంది?

విహారి సమాధానం చెప్పలేదు. ఈ లోపులో ప్రవల్లిక లోపలికి వచ్చింది. ఆమె మొహం పాలిపోయి వుంది.

అరిచాడు.

కంట్రోల్ యువర్ సెల్ఫ్ అంటూ భుజంతట్టి విహారి డాక్టరుతో ఏదో మాట్లాడాడు.

ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్ళటానికి బదులు స్ట్రెచర్‌ని జనరల్ వార్డుగుండా బయటకు తీసుకొచ్చారు. పొడవాటి వరండా.

ఎక్కడికి? ఎక్కడికి తీసుకెళ్తున్నారు నన్ను? అరిచాడు.

స్ట్రెచర్ ఒక గదిముందు ఆగింది. దాన్ని చూసి ఆశ్చర్యపడ్డాడు.

మార్చురీ అతడేదో అనబోతూ వుంటే లోపల్నుంచి బోయ్ తలుపు తెరిచాడు. స్ట్రెచర్ శవాలుండే గదిలోకి వెళ్ళింది.

తలతిప్పి చూసిన రామ్‌లాల్ వికృతంగా కేకపెట్టాడు.

గదిలో వుండే మృత కళేబరాన్ని కూడా కదిలించేలా వుంది ఆ కేక.

మార్చురీ టేబుల్ మీద వరుసగా మూడు శవాలున్నాయి.

అతని భార్య ..... ఇద్దరు కొడుకులు.

పన్నెండు వరకూ చూసి టికెట్ బుక్ చేసేదము అన్న మాటలకి అర్థం చెపుతున్నట్టు మూడు శరీరాలు బుల్లెట్ గుళ్ల గాయాలతో పైన కప్పిన దుప్పటిని కూడా తడిపేశాయి.

స్ట్రెచర్ మీద నుంచి లేవబోతున్న రామ్‌లాల్‌ని బలవంతంగా నొక్కిపట్టాడు విహారి ప్లీజ్..... ఎగ్జయిట్ అవకు అంటూ ఆ శవాల దగ్గరకీ తీసుకెళ్ళాడు.

రామ్‌లాల్ ఆకులా కదిలిపోతున్నాడు. అతడికి భార్య పిల్లలంటే వల్లమాలిన ప్రేమ. కుర్రవాడి క్రికెట్‌కోసం కరెంట్ ఆఫీస్‌నే బాంబుల్తో కూల్చేసినవాడు అతడు అంతటి నరరూప రాక్షసుడూ కిరాతకుడూ అంతకుముందు ఎందరో అమాయకుల్ని ఇంతకన్నా దారుణంగా చంపినవాడు ..... విషయం తన వరకు వచ్చేసరికి ఆనకట్ట బ్రద్దలయినట్టు కంపిస్తున్నాడు. లేవటానికి కాళ్ళు లేవు. పక్కనుంచే వాళ్ళని చూశాడు. నిర్జీవ ప్రతిమల్లా ఉన్నాయి శవాలు భోరున మీద పడి ఏడవటానికి కూడా వీల్లేకుండా కాళ్ళకి కట్లు ఇంత కాలం చూపించిన భక్తికి స్వామి ఎడల విధేయతకి ప్రతిఫలంగా దొరికిన బహుమతులు.

అతడు హిస్టీరిక్‌గా మారటం చూసి డాక్టర్లు అతడిని అక్కడ నుంచి బలవంతంగా బయటకు తీసుకొచ్చాడు.

ఇంత అప్‌సెట్ అవుతాడనుకోలేదు. ఆపరేషన్ మరో రెండ్రోజులు వాయిదావేస్తే మంచిదేమో అంటున్నారు డాక్టర్.

విహారి రామ్‌లాల్ మీద చెయ్యి వేసి ఐయామ్ సారీ మనిద్దరికి మధ్య శత్రుత్వం ఉన్న మాట నిజమే కానీ మన పోరాటంలో అనవసరంగా ఈ అమాయకులు బలి అవుతారు అనుకోలేదు.

ఆ దుర్మార్గుడు ..... ఆ స్వామి ..... వాడి అంతు తేలుస్తాను.

నేను నీకు ముందునుంచీ చెపుతూ వస్తున్నాను నేను నిన్ను వదిలిన మరుక్షణం ప్రమాదం అని ఇక నీ వాళ్ళకి ఏ విధంగానూ పనికిరావు. నువ్వు బ్రతకాలంటే స్వామిని నిర్వీర్యం చెయ్యటం తప్ప మరో మార్గం లేదు. స్వామి గురించి నీకు తెలిసిందంతా చెప్పు మిగతాది నేను చూసుకుంటాను.

ఏం చెప్పాలి? అన్నాడు రామ్‌లాల్ అతడి కంఠం నూతిలోంచి వచ్చినట్టు వుంది. ఒకప్పటి పొగరు బింకం ధైర్యం లేవిప్పుడు. సర్వశక్తులు ఉడిగినవాడిలా ఉన్నాడు.

జపాన్ నుంచి వచ్చే ఓడకూ అనంతానంతస్వామికీ ఏమిటి సంబంధం?

మధ్యలో గోల్డెన్ ఐలెండ్ దగ్గర ఆయుధాలు షిప్‌లోకి చేర్చబడతాయి. విజయదశమి రోజున దాదాపు ఇరవైలక్షల మంది భక్తులకి స్వామి ఉపన్యాసం ఇవ్వబోతున్నాడు. ఆ ఉపన్యాసాన్ని పరమేశ్వరం తయారు చేస్తున్నాడు. ప్రస్తుత చట్టం ద్వారా ఒక మతస్థులకు జరుగుతున్న అన్యాయం ఆ ఉపన్యాసంలో వివరంగా చెప్పబోతున్నాడు. అన్నీ సత్యాలే కానీ ఆ ఉపన్యాసం వింటే మనకింత అన్యాయం జరుగుతుందా అని ఎవరికయినా అనిపించేలా రెచ్చగొట్టేలా వుంటుంది. అది ఆ ఉపన్యాసం క్యాసెట్లు దేశమంతా ఉచితంగా పంచుతారు రెండుకోట్ల రూపాయలు దానికోసం ఖర్చు పెడతారు ప్రభుత్వం కూడా దీన్ని ఏమీ చేయలేరు. ఆ తరువాతే అసలు గొడవ మొదలవుతుంది.

ఏం జరుగుతుంది.

దేవాలయాల్లోకి కొబ్బరికాయల్లాంటి బాంబులు స్మగుల్డ్ చేయబడతాయి. ఆ ప్రేలుళ్ళతో మతకల్లోలాలు ప్రారంభమవుతాయి అదే సమయానికి ఒక గ్రైనేడ్ ఢిల్లీలో పేలుతుంది. కొన్ని దేశాల నాయకులు మరణిస్తారు కేవలం ఆయా దేశాల జోక్యం కోసమే ఇది జరుగుతుంది. ఈ లోపులో దేశంలో సెక్యూలరిజం పోయి అరాచకత్వం మొదలవుతుంది. స్వామి అత్యున్నత పీఠం అధిష్ఠించి, తనే నిర్దేశకుడిగా ప్రకటించగానే పక్క దేశాలు అతన్ని గుర్తిస్తాయి. ఒక అగ్రరాజ్యం క్షణాల మీద తన సేనని పంపుతుంది.

ఒక సి.బి.ఐ ఆఫీసర్‌గా ప్రవల్లిక ఎన్నో కేసుల్ని చూసింది. డబ్బు కోసం అధికారం కోసం ఎన్నో ఎత్తులు వేసిన వారినీ మోసం చేసిన వారినీ చూసింది కానీ ఈ రోజు రామ్‌లాల్ చెపుతున్నది వింటూంటే ఆమె శరీరం జలదరించింది. ఆమె స్వామి మీద రిపోర్టు తయారు చేసినమాట నిజమే. కానీ ప్రమాదం ఇంత దగ్గర్లో వుందని వూహించలేదు. ఈ రోజు విహారి ఈ పని చేయకపోయివుంటే చాపకింద నీరులా ప్రమాదం దేశమంతా వ్యాపించి వుండేది.

ఆమె మెదడు పాదరసం కన్నా వేగంగా ఆలోచిస్తోంది.

ఈ కొద్ది సమయంలో స్వామినెలా ఎదుర్కోవడం? ఆయుధాలు తీసుకొస్తున్న ఓడని బంధించవచ్చు దాని వల్ల స్వామికేమీ నష్టం జరగదు అంతకన్నా భయంకరమైన ఆయుధం స్వామి చేతుల్లో వుంది. దాని పేరు మతం అతడి ఉపన్యాసాన్ని గానీ అతడి పనులని గానీ ప్రభుత్వం ఏ విధంగానూ ఎదుర్కోలేదు. కొన్ని కోట్లది ప్రజల సున్నితమైన సెంటిమెంట్‌ని రెచ్చగొట్టేలా ఆ ఉపన్యాసాన్ని పరమేశ్వరం తయారు చేశాడనటంలో సందేహం లేదు. ఒక

మతప్రవక్తని అరెస్టుచేసే ధైర్యం ప్రభుత్వానికి లేదు.

విహారి మాటలకి ఆమె ఈ లోకంలోకి వచ్చింది

నువ్వు చెప్పినదాన్నంతా సాక్ష్యాధారాల్తో ధ్రువీకరించగలవా రామ్‌లాల్? విహారి అడుగుతున్నాడు.

నా దగ్గిర సాక్ష్యాలేమి లేవు. నాకు తెలిసిన ఇంకొక విషయం ఏమిటంటే ఎవరయినా పరీక్షకు వస్తున్నారంటే క్షణాల్లో ఆ దీవి పరిస్థితిని మార్చేసే ఏర్పాట్లు అక్కడున్నాయి. అక్కడ కూడా సాక్ష్యాలేవీ దొరకవు.

ఈ స్వామి గురించి సాక్ష్యాలు ఎవరు ఇవ్వగలరు?

పరమేశ్వరం ఇవ్వగలడు.

ఇంకా?

సూర్యారావు ఇవ్వగలడు.

నువ్వొక సాయం చేస్తే ..... ఒక అబద్ధం చెప్తే సూర్యారావు మనలో కలిసిపోతాడు. ఏం చెప్పాలీ అన్నది ప్రవల్లిక చెపుతుంది. నేను వెళ్ళి అతనితో ఫోన్ చేయిస్తాను. అతను కూడా ఆస్పత్రిలోనే వున్నాడు.

ఈ ఆస్పత్రిలోనా?

ఔను. అతనికి గుండెపోటు వచ్చింది. నీ అంత వచ్చింది. నీ అంత ధైర్యమైనవాడు కాడనుకుంటాను పదవి పోయేసరికి తట్టుకోలేక పోయాడు. అంటూ విహారి అక్కణ్నుంచి కదలబోయాడు.

విహారి ..... పిలిచాడు రామ్‌లాల్.

విహారి ఆగి ఏమిటన్నట్టు చుశాడు.

ఆ స్వామిని నేను నా స్వహస్తాలతో చంపాలి.

విహారి నవ్వి ఆ పని కోసం ఇప్పటికే ఇద్దరం కాచుకొని వున్నాం. క్యూలో నువ్వు మూడవ వాడివి సూర్యారావు కూడా తోడయితే నాల్గో వాడివి అనేసి బయటకొచ్చాడు.

## 20

సూర్యారావుకి స్పృహ వచ్చి నెమ్మదిగా కళ్ళు విప్పాడు.

గది నిశ్శబ్దంగా వుంది.

ఎక్కడున్నాడో తెలీక కదుల్తూంటే గుండెల దగ్గిర వైరు తగిలింది అదిరిపడ్డాడు. పక్కనే కార్డియోగ్రామ్‌లో చుక్క పైకీ క్రిందకీ కదుల్తూ గుండె కొట్టుకోవడాన్ని సూచిస్తూంది.

తనెక్కడున్నాడో తెలిసింది.

అతడికి స్పృహ రావటం చూసి నర్సు లోపలి కొచ్చింది. తను ఎంత కాలం నుంచి ఇలా ఉన్నానని అడిగాడు.

ఆమె చెప్పిన విషయాలు అతడ్ని భయకంపితుడ్ని చేశాయి.

రెండ్రోజుల క్రితం హార్ట్ అటాక్ వచ్చింది. డాక్టర్లు ఇరవై నాలుగు గంటలపాటు కష్టపడ్డారు. అదృష్టం బావుంది. ఇది దాదాపు పునర్జన్మ అయినా ఇకముందు చాలా జాగ్రత్తగా వుండాలి. ఏమాత్రం వత్తిడి కలిగినా ప్రమాదమే శేష జీవితం కేవలం బ్రతకటం కోసమే తప్ప ఆనందం కోసం కాదు.

తనకి ఇలా ఎందుకు జరిగింది సూర్యారావుకి తెలుసు. ఒక వేపు మంత్రి పదవి పోవటం ..... మరోవేపు అరెస్టు అయి పరువు పోవటం.

దానికి కారణం మీ అనంతానంతస్వామి అన్నాడు విహారి. ఇప్పుడే విషయమంతా కనుక్కున్నాను. మీరు ఒప్పందం మీద సంతకం పెట్టడం ఒక రోజు ఆలస్యం చేసే సరికి స్వామి అగ్గిమీద గుగ్గిలమయ్యాడట తనెంత పవర్‌ఫుల్ మనిషో కావాలనుకుంటే ఏం చెయ్యగలడో తెలియజెప్పటం కోసం ఒక అమ్మాయిని పంపి మీ ప్రతిష్ట మంట గలిపాడు.

నిజమా? అన్నాడు సూర్యారావు.

అవును నాకప్పుడే అనుమానం వచ్చింది. మీ కూతుర్ని నేను పంపేసిన తర్వాత ఈ బ్లాక్ మెయిలర్ ఎవరా అని అనుకున్నాను. అదీ గాక అయిదు పదివేల కోసం కిడ్నాప్ చెయ్యటమేమిటని కూడా అనుకున్నాను. మరుసటి రోజు పేపర్లో చదివేను మీ పదవి పోవటం గుండె పోటు రావడం ఈ సంగతులన్నీ.

స్వామే ఇదంతా చేశాడని నీకెలా నిశ్చయంగా తెల్సు?

రామ్‌లాల్ చెప్పాడు.

సూర్యారావు అదిరిపడ్డట్టు కార్డియోగ్రాఫ్ సూచించింది రా ..... రామ్‌లాల్ నీకెలా తెల్సు అని అడిగాడు.

అతడు కూడా ఇదే ఆస్పత్రిలో వున్నాడు. పాపం అతడికి కూడా చాలా ఘోరమైన అన్యాయం జరిగింది. అతడి నోటివెంటే వినండి ..... అంటూ ఫోన్ చేశాడు.

దాదాపు పది నిమిషాలు ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు అంతసేపూ విహారి నిశ్శబ్దంగా వున్నాడు. సుర్యారావు ఫోన్ పెట్టేస్తూ ఈ స్వామికి తనమీద తనకు నమ్మకం ఎక్కువైపోయింది అన్నాడు విహారి జవాబు చెప్పలేదు. మళ్ళీ తనే ..... నేనంటే ఎక్కువ రాజకీయం చూసుకునే వాడిని రామ్‌లాల్ అలాకాదు, నమ్మినబంటులా పనిచేశాడు అటువంటి వాడి ఫామిలీని మొత్తం చంపేశాడంటే వాడు స్వామి కాదు యముడు.

అటువంటి యముడు కొద్దిరోజుల్లో ఈ దేశపు నియంత కాబోతున్నాడు. మీరు అతడి దగ్గర మంత్రి అయినా మేం ఆశ్చర్యపోము.